గాంజా పంజా !

● గంజాయి బ్యాచ్‌కు అడ్డాలుగా మూసీ పరీవాహక కాలనీలు ● రక్షణ కల్పించాలని పోలీసులను కోరుతున్న ప్రజలు



రామంతాపూర్ : చిన్న చెరువు వాకింగ్, ట్రాక్ మూసీనది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న లక్ష్మీకాంత్‌నగర్, సత్యానగర్, కుర్మానగర్‌తో పాటు ఉప్పల్ ఐటీడీఏ పాల ఫ్యాక్టరీ ఎదుట గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అర్ధరాత్రి వరకు హల్‌చల్..

గంజాయి అడ్డాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు గంజాయి, తదితర మత్తు పదార్థాలు సేవిస్తూ.. పరస్పరం దాడులు చేసుకోవడంతో పాటు స్థానికులపై కూడా దాడులు చేస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

యువకులే అధికంగా..

ఈ గంజాయి బ్యాచ్‌లోని వారంతా యువకులే కొంతమంది గంజాయిని తెచ్చి, కొద్ది రోజులు ఉచితంగా అందజేసి, అనంతరం పెద్దఎత్తున గంజాయిని విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి.

చీకటి పడితే చాలు..

రామంతాపూర్‌లోని పలు కాలనీలు, బస్తీల మధ్యన ఉన్న చిన్న చెరువు వాకింగ్ ట్రాక్ రాంరెడ్డినగర్ నుంచి కేసీఆర్‌నగర్ వరకు గల బైపాస్ రోడ్డు, పరివాహక ప్రాంతంలో ఉన్న కాలనీలో చీకటైతే పోకిరీలు గుంపులుగా చేరి గంజాయి, మద్యం వైట్నర్ తదితర మత్తు పదార్థాలు సేవించి పరస్పరం దాడులు చేసుకుంటూ.. భయాందోళన కలిగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ప్రశ్నించిన వారిపై దాడులు..

ప్రశ్నించిన వారిపై విచక్షణారహితంగా గంజాయి బ్యాచ్‌లు దాడులకు పాల్పడుతున్నాయి. గత శుక్రవారం రాత్రి మూసీ పరివాహక కాలనీ ఆయన లక్ష్మీకాంతనగర్‌లో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసి ఓ కుటుంబానికి చెందిన ఇంటి తలుపులు పగులగొట్టి ఆ కుటుంబంలోని భరత్ అనే యువకుడిపై విచక్షణా రహితంగా దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారు. భరత్ తలపై బలమైన గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. భరత్ ఇంటి ముందు ఉన్న తన ఆటోలో ముగ్గురు యువకులు కూర్చుని గంజాయి సేవిస్తుంటే మందలించిన భరత్‌పై కక్ష పెంచుకుని మరికొంత మంది యువకులను పిలిపించుకుని దాడి చేసినట్లు సమాచారం. ఈ గంజాయి విక్రయించే వారిని సేవించే వారిని పోలీసులు పలుసార్లు అరెస్టు చేసిన తిరిగి బెయిల్‌పై వచ్చి దందా కొనసాగిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న భరత్



ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

ప్రజలకు రక్షణ కల్పించాలి..

సాయంత్రం 5 దాటితే చాలు గంజాయి బ్యాచ్‌లు ఏమి చేస్తారోననే భయంతే గడుపుతున్నామని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. లక్ష్మీకాంతనగర్, సత్యానగర్, కుర్మానగర్‌తో పాటు రామంతాపూర్ చిన్నచెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న బస్తీలు, కాలనీలోని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వారి నుంచి కాలనీలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి..



రామంతాపూర్‌లోని మూసీ పరివాహక బస్తీలు, కాలనీలతో పాటు చిన్నచెరువు వాకింగ్ ట్రాక్‌లో గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ.. హంగామా సృష్టిస్తున్న పోకిరి ఆగడాలను అరికట్టాలి.

– నీలిగొండ సాగర్, లక్ష్మీకాంత్‌నగర్

నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన

ఉప్పల్: లగచర్ల రైతుల పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేయనున్నట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అంజేయనున్నట్లు ప్రకటించారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

రామంతాపూర్ : రెండ్రోజుల పాటు జరిగిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రిన్స్‌స్టన్ డిగ్రీ, పీజీ కళాశాల మెగా మహిళా జూనియర్ డిగ్రీ కళాశాల, క్రాంతి డిగ్రీ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల సహా తదితర పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు జరిగాయి. సోమవారం నిర్వహించిన మొదటి సెషన్, రెండో సెషన్ పరీక్షలు పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గోపాల్‌గౌడ్

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో సోమవారం యశోద హాస్పిటల్స్, హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, టుడి ఎకో, గైనకాలజిస్ట్ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. మంచి పౌష్ఠికాహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండేందుకు గడపాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, కాంగ్రెస్ పార్టీ నేతలు కొత్త గోపాల్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్ నుంచి కార్తికేయనగర్ మధ్యలో బిడ్జికి నిధులు, రాంరెడ్డినగర్‌లో వరదనీటి సమస్య పరిష్కారానికి ఈఎస్‌ఐ నుంచి నాలా పైపులైన్ వేయాలని కోరారు. రాఘవేంద్రనగర్, అన్నపూర్ణకాలనీ, శాంతి గార్డెన్స్, ఇంద్రానగర్, రవీంద్రనగర్ తదితర కాలనీవాసుల కోసం పార్కు, ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ వివరించారు.

ఇందిరమ్మ ఇంటి సర్వేకు ప్రజలు సహకరించాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీ రాజు

మల్కాజిగిరి: ఇందిరమ్మ ఇంటి సర్వేకు ప్రజలు సహకరించాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు కోరారు. సోమవారం సర్వేలో అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. డీసీ మాట్లాడుతూ.. గతంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికోసం 42,968 దరఖాస్తులు అందాయన్నారు. సర్కిల్ పరిధిలోని 6 డివిజన్లలో 6 బృందాలను సర్వేకోసం ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సర్వే సిబ్బంది వారికి కేటాయించిన దరఖాస్తుదారులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులను గుర్తించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించాలని సూచించామన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వసతులు కల్పించండి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఏరియా ఆసుపత్రి (ప్రభుత్వ మెడికల్ కాలేజీ కుత్బుల్లాపూర్)లో వసతులు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర వైద్యశాఖమంత్రి దామోదర రాజనరసింహకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆసుపత్రిని సందర్శించి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సంగీత్‌తో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది మార్చినెలలో ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా డయాలసిస్ సెంటర్, సిటీస్కాన్, బ్లడ్ బ్యాంక్, డయగ్నస్టిక్ ల్యాబ్, ట్రామాకేర్ యూనిట్, ఆపరేషన్ థియేటర్‌తో పాటు మౌలిక వసతులు అవసరమని గుర్తించామన్నారు. మెడికల్ కాలేజీకి సంబంధించి ఆస్పత్రి కావడంతో వీటిని ఎంత తర్వగా ఏర్పాటు చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించగల్గుతామని, మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. త్వరలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, రోగులతో పాటు అటెండ్లరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు గదుల నిర్మాణం జరిగేలా చూస్తామన్నారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తూ..

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారానికి మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సాయిసూర్యకాలనీ, లక్ష్మీనగర్ ఫేజ్–2 వద్ద సోమవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పాదయాత్ర చేశారు. సాయిసూర్యకాలనీ, లక్ష్మీనగర్ రెండు కొత్త కాలనీలు పూర్తి ఆక్యుపెన్సీతో డివిజన్ పరిధిలోకి రాబోతున్నందున కాలనీలో రోడ్డు, డ్రైనేజీలైన్లకు సంబంధించి తనిఖీలు చేశారు. డీఈ మహేష్, కాలనీవాసులు సురేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఫణీంద్ర, విజయ్‌భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్, మనోజ్, వెంకటేష్, నాసర్, శ్రీధర్, సందీప్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి,నవీన్, మధన్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, కరుణాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. రోడ్డు పనుల ప్రతిపాదనలు బడ్జెట్ కోసం పెండింగ్‌లో ఉన్నాయని, గత ప్రభుత్వం స్పెషల్ నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులను తిరిగి మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్‌ను కోరినట్లు కార్పొరేటర్ వివరించారు.

అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పోచారం: యంనంపేట్‌లోని సర్వే నెంబర్ 90లో జరుగుతున్న మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే ఘట్‌కేసర్ మండల తహశీల్దారుతో పాటు పోచారం మున్సిపల్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అక్రమ తవ్వకాలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 19, 20 వార్డుల పరిధిలోని హోల్డ్ విలేజ్‌లో సుమారు 15 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

ప్రజావాణికి 10 ఫిర్యాదులు



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో..

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పదికి పైగా ఫిర్యాదులు వచ్చాయని డీసీ రాజు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 4, ఇంజినీరింగ్ విభాగం, యూజీడీ విభాగంలో 1 ఫిర్యాదు, రెవెన్యూ విభాగం, శానిటేషన్ విభాగంలో 2 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజావాణితో సమస్యలు పరిష్కరించడంలో ఎలాంటి చర్యలు లేవని విమర్శలున్నాయి. అధికారుల గైర్హాజరుపై మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సఫిల్‌గూడ రైల్వేగేట్ పక్కన ఖాళీ స్థలం వద్ద రోడ్డు మరమ్మతులు, బాలసరస్వతీనగర్‌లో నాలా నిర్మాణం, నిర్వాసితులకు నష్ట పరిహారం, గ్రీన్‌వేస్ట్‌ను తొలగించేందుకు ప్రత్యేక వాహన ఏర్పాటు, ఉచిత విద్యుత్ సబ్సిడీ తదితర సమస్యలను ప్రజావాణిలో డబుల్‌ఎంట్రీ పీటీఐఎన్ పరిష్కరించాలని కోరానని పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పీవీఎన్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం పీవీఎస్‌కాలనీలో రూ.15 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. యూజీడీ పనులు పూర్తయిన కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, నాణ్యతపై అనుమానం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాబు, సంపత్‌రావు, కిషోర్ పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



కార్మికులతో సీఐటీయూ నేతలు

ఉప్పల్: కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులు, డ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా బాధ్యులు బంగారు నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ విశాల్‌మార్ట్ చౌరస్తా వద్ద ఉన్న ఆటో ట్రాలీ, డీసీఎం, లారీ తదితర వాహనాల డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైవర్లపై ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని, ప్రైవేట్ ఓలా, ఉబర్ లాంటి యాప్‌ను నియంత్రించాలన్నారు. ఈ చలాన్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పల్ కార్యదర్శి వెంకన్న, ఆటో ట్రాలి యూనియన్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కుషాయిగూడ: జాతీయస్థాయి కరాటే పోటీల్లో చర్లపల్లి, కుషాయిగూడకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం నగరంలోని జీడిమెట్ల,షాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు విజయం సాధించి పలు పతకాలను సొంతం చేసుకున్నట్లు కరాటే మాస్టార్ బుడిగే రవికుమార్ తెలిపారు. అద్వైత, దివ్యశ్రీ, జోషి, శ్రీనిష్, వరుణి, భువన, సహర్ష రెడ్డి బంగారు పతకాలు, బ్రాహ్మిణి, నిశాంత్, తేజస్, శతాన్వీ, వైభవ్, జోషి, ఎస్వీ కార్తీహ రజత పతకాలు సాధించగా.. ఆరాధ్య, శ్రీహిత, ధృకే ఆత్రేయ, కింషుక్ సింగ్ క్యాంస పతకాలు సాధించారన్నారు.ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థి, పతకాలతో చిన్నారులు

కార్పొరేటర్ పర్యటన



కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలో ఆదర్శ్‌నగర్‌లో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ, రైల్వే అధికారులతో కలిసి పర్యటించారు. మహాబోధి విద్యాలయం నుంచి ఆదర్శ్‌నగర్ వద్ద ఆర్‌యూబీ వరకు డ్రైన్‌కు ఇప్పటికే ఆర్‌సీసీ పైపుస్మార్ట్ వాటర్ డ్రైన్ పునర్నిర్మించడానికి ప్రతిపాదనను సమీక్షించారు. కాలనీల్లో ముంపు నివారణకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అల్వాల్ సర్కిల్ డిప్యూటీ ఈఈ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులతో క్రిస్మస్ ట్రీ

70 అడుగుల క్రిస్మస్ ట్రీ ఏర్పాటు



మౌలాలి : ఏఎమ్మార్ ప్లానెట్ మాల్‌లో 70 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెవరెండ్ ఎరువ బాలస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ఇంత భారీ ఎత్తున క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏఎమ్మార్ మాల్ ఎండీ రాకేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ చాగంటి ఆనంద్‌కుమార్‌లు మాట్లాడుతూ.. గతేడాది 50 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశామని, ఈసారి 70 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి ఏర్పాటు చేసి తమ రికార్డును తామే అధిగమించామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌లో రూ.కోటితో చేపడుతున్న డ్రైన్‌బాక్స్ పనులను సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, జీహెచ్‌ఎంసీ డీఈ నాగమణి, శ్వేతశ్రీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రైన్‌బాక్స్ పనులు నత్తనడకన జరుగుతున్నాయని, దీంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయడంతో పాటు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హెచ్చరించారు. బీజేపీ నేతలు నారాయణదాసు, వీణ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం ప్రత్యేక పూజలు

బోడుప్పల్: .శ్రీసాయి భవానీనగర్ కాలనీలోని స్పటిక లింగేశ్వర సహిత సీతారామంజనేయ దేవాలయంలో సోమవారం ఉదయం ధనుర్మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త జడిగె మంజుల రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. శ్రీ మహావిష్ణువు మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైందిగా భావించే ధనుర్మాసం ఈనెల 16 నుంచి జనవరి 13 వరకు కొనసాగుతుందన్నారు. ఈ మాసంలో భగవంతుడికి సంబంధించిన కార్యక్రమాలు తప్ప ఇతర కార్యక్రమాలు జరుగవన్నారు. ఈ మాసంలో వేంకటేశ్వరస్వామిని ఒక్కరోజు పూజించిన ఫలం ఎక్కువగా దక్కుతుందన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు (ధనుర్మాస పూజ) ప్రారంభమయ్యాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, తులసీ రమణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 19న తిరుప్పావడ సేవ, 21న పుబ్బ నక్షత్రం సందర్భంగా గోదాదేవి, మహాలక్ష్మి అమ్మవార్లకు అలంకరణ సేవ, 26న శ్రీవారికి చందనసేవ, జనవరి 3న చందనోత్సవం, 6న విశేష ఫలాలంకరణ, 8న పుష్పయాగం , 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11న కూడారై సేవ, 13న సంక్రాంతి, 14న గోదారంగనాథుల కల్యాణం, రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.





ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు.

సెల్‌ఫోన్ దొంగిలించాడని అనుమానంతో..

● బీర్ బాటిల్‌తో తలపై కొట్టి చంపిన వైనం ● ఇద్దరు నిందితుల రిమాండ్

అల్వాల్: సెల్‌ఫోన్ దొంగిలించాడనే నెపంతో ఇద్దరు అన్నదమ్ములు ఓ వ్యక్తితో గొడవపడి హత్య చేసిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన హంతు (55) కుటుంబంతో కలిసి గోకుల్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వంట మనిషిగా పనిచేస్తూ.. మద్యానికి బానిసై గత 3 నెలల నుంచి ఇంటికి వెళ్లకుండా బయటే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి నేరేడ్‌మెట్ శ్రీసాయినగర్‌లోని ఓ బిల్డింగ్ సెల్లార్‌లో నిద్రిస్తుండగా.. స్థానికంగా ఉండే హంస గణేష్ (24), హంస నవీన్ అలియాస్ భగవాన్‌దాస్ (22)లు అక్కడకు రాగానే వారి సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో హంతు దొంగిలించాడనే నెపంతో వాగ్వివాదానికి దిగారు. అన్నదమ్ములిద్దరూ కలిసి బీర్ బాటిల్‌తో అతడి తలపై కొట్టి పరారయ్యారు. కాగా తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. 24 గంటల్లోనే నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. గతంలోనే వారిపై తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు ఉన్నట్లు సమాచారం.



హంతు (ఫైల్)

ఆర్చిడ్స్ స్కూల్‌లో 'ఖేల్ మహోత్సవ్'



అల్వాల్: బొల్లారం ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఆధ్వర్యంలో 'ఖేల్ మహోత్సవ్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 6 బ్రాంచీలకు చెందిన విద్యార్థులు హాజరై చెస్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, స్కేటింగ్, స్విమ్మింగ్, బాక్స్ క్రికెట్, తైక్వాండో క్రీడలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్యారా వరల్డ్ చాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ గౌతమ్‌యాదవ్ హాజరై క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. తైక్వాండో ఎక్స్‌పర్ట్ సతీష్, స్పోర్ట్స్ అకడమిక్ మేనేజర్ వాజిద్‌అలీ, వీర బసవయ్య, బాలకృష్ణ, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.